# ప్రేమగీతం

## ఇందూరమణ

సరిగ్గా—
మధ్యాహ్నం పన్నెండయ్యింది.

ఆఫీసు మూసేసి మెట్లు దిగుతున్నాను. మా కొలీగ్స్ ఏదో దీర్ఘమైన చర్చల్లో ఉన్నారు. బంట్రోతు గేటు తాళాలు వేస్తున్నాడు.

నాకు అర్జెంటుగా వైజాగ్ వెళ్ళాల్సిన పని పడింది. ఇంటికివెళ్ళి భోజనంచేసి అలా టౌన్ కెళ్ళాలి.

తలదించుకుని ఆలోచిస్తూ నెమ్మదిగా నేనొక్కణ్ణే ఒంటరిగా నడుస్తున్నాను.

"ఒరేయ్ రాజా!"

ఎవరో వెనుకనుండి గావుకేక పెట్టి పిలిచేసరికి ఉలిక్కిపడి తలెత్తి చూసాను.

ఎదురుగా—

ఎన్నాళ్ళ తర్వాతో .... ఎన్నేళ్ళ తర్వాతో...గుండెల్లో తన ప్రతిరూపాన్ని మిగిల్చి నా మనసులోనూ... మెదడులోనూ చిచ్చు రగిల్చి తనని ఏకాకిని చేసి వెళ్ళిపోయిన వసంత—!

వసంత ఎవరో ఇద్దరమ్మాయిలతో.... వాళ్ళమధ్య రాజకన్యలా నడుస్తూ వస్తోంది.

ఆమెని అలా... అంత హఠాత్తుగా చూసేసరికి ఒక్కసారి షాకయ్యాను. నాకు తెలియకుండానే నా శరీరం షేక య్యింది.

పదేళ్ళక్రితం నాటి మాట.

అప్పటి నా ప్రేమదేవత.

ఒకప్పటి నా ప్రేమ సామ్రాజ్య పట్టమహిషి.

వసంత!!!

నన్నుదాటి ...మా వాళ్ళనుదాటి .... క్రీగంట కూడా తనని తిలకించకుండా.... కనీసం ఈవూరు ... ఈ వాతావరణం ఈ దారులు ... ఈ మేడలు తనకస్సలు ఇంతకు పూర్వం పరిచయమే లేనట్టు తల దించుకుని జోరుగా నడుచుకుంటూ వెళ్ళిపోతోంది.

వసంత!

నా గుండెల్లో ఎక్కడో ... ఏదో... చిన్న సవ్వడి.

"డియర్ రాజా! నేనెందుకు చెప్పట్లు చరిచి నిన్ను ఆపేనో అర్థమయిందనుకుంటాను. నీ మాజీ ప్రియురాలు నీ ముందర నుండే వెళ్ళిపోతుంటే నీ ఆలోచన్లలో నువ్వు తల దించుక సాగిపోతున్నావు, ఈ క్షణం... ఈ అవకాశం ... ఈ అదృష్టం ... ఈ మహాభాగ్యం పోగొట్టుకుంటే ఇంకో జన్మెత్తినా నీ ప్రేమ దేవతని చూడాలన్నా చూడలేవు. కాదంటావా?"

రామకృష్ణ నన్ను చేరుకొని నా భుజం మీద చెయ్యివేస్తూ అన్నాడు.

ఎలా కాదంటాను?

అక్కడే—

అలాగే నిలబడి గతించిన కాలంలా సాగిపోతున్న వసంతని చూస్తూండిపోయాను. ఆమె వీధి చివరి మలుపు తిరిగిన వరకూ .... ఆమె రూపం మసకబారిన వరకూ ... చూస్తూ నిలబడ్డాను.

"మరిక ఈ పూటికి వైజాగ్ వెళ్ళనట్టే నుంటావు." రామకృష్ణ మళ్ళా నవ్వుతూ అన్నాడు.

అప్పుడుమరి!

నా ఆవేదన పిచ్చి పిచ్చిగా అనిపిస్తోంది మరి.

వీధికేసి చూసాను.

ఆనాడు—

ఈ వూరు .... వూరంతా ఎలా నవ్వింది? వూరి జనమంతా ఎలా హేళన చేసారు?

ఇప్పటికీ—

ఆరోజు .... ఆ క్షణం ... జరిగిన సంఘటన నా కళ్ళముందు కదులుతూనే



ఉంది.

నా కళ్ళల్లో అప్పటి అవమానజ్వాల ఇప్పటికీ మండుతూనే ఉంది.

వ...సం...త!

నా పాడు మనస్సెందుకో మళ్ళా... మళ్ళా వసంతని చూడాలని.... తనివితీరా చూసి తరించాలని తెగ తల్లడిల్లుతోంది.

అప్పటికి — ఇప్పటికీ — వసంతలో ఎలాంటి మార్పూ లేదు. మారిందల్లా ఒక్కటే!

వోణీలు వేసుకు తిరిగిన వసంత ఇప్పుడు చీర కట్టింది.

చీరలో ఎంత నిండుగా ఉంది!

పెళ్ళయి పదేళ్ళయినా ఎంత నాజూకుగా... పెళ్ళికాని పిల్లలా ఎంత అందంగా హుందాగా ఉంది!

ఆ నడక —

నడిచేటప్పుడు ఆ చేతి విసురూ—

ఆ నడకలో జోరు తగ్గలేదు. ఆ చేతి విసురులో హొయలు మాయం కాలేదు. ఆమె శరీర బింకమూ చావలేదు.

'నేనే ... నేనే అన్నివిధాలుగా చావు దెబ్బలు తిన్నాను.

పెళ్ళి పెటాకులు కాని ముదర బ్రహ్మచారిగా —

ఇల్లూవాకిలీ లేని ఛెనాధగా —

'నా' అన్నవాడెవరూ లేని ఏకాకిగా—

ఒంటరిగా కుంటి బ్రతుకు సాగిస్తున్నాను.

అన్యమనస్కంగానే ఇల్లు చేరుకున్నాను.

ఉదయాన్నెప్పుడో వండిన వంట. ఆఫీసుకువెళ్తూ వండిన వంట. తినబుద్ధి కాక ... ఆకలి అనిపించక మంచం మీద అలాగే వెనక్కు వాలి మేను వాల్చాను.

భూతంలా పొంచిఉన్న గతం ఒక్కసారి మీద పడింది.

జ్ఞాపకాల్లో దొర్లుకుంటూ గతంలోకి జారిపోయాను.

* * *

"వసంతా! ... వసంతా! ఆగు వసంతా! అబ్బ నేనంత జోరుగా నడవలేను వసంతా! ప్లీజ్, ఆగవూ!"

"రాజూ! ... రా! రాజూ! ఆడపిల్లన్నేను. నువ్వేమో మగాడివి. ఈమాత్రం నడవలేవూ?"

"ఇక నేను నడవలేను వసంత. నావల్ల కాదు" రోడ్డుమీద చతికిలబడుతూ అన్నాను.

"అబ్బ! రా! రాజూ! ఇంకో మైలుంటుంది. ఇక్కడ్నుంచి ఈ కాలిబాటన వెళ్తే మన గమ్యం చేరుకుంటాం. ప్లీజ్! లే! రాజూ!" నా దగ్గరకు వచ్చి నాచేయి పట్టుకొని లేవనెత్తుతూ అంది వసంత.


"కూర్చో! ఓ అరక్షణం సేద దీర్చుకుని లేచి పరుగెడదాం. ఓకేనా?" చిన్నగా నవ్వుతూ అన్నాను ఆయాసంతో రొప్పుతూ.

"రాజూ! ఈ ప్రమాదకర పరిస్థితిలో కూడా నువ్వెలా నవ్వగలుగుతున్నావో నాకర్థం కాదు.

పద. మనం ముందు భైరవవాక చేరుకుంటే మీ స్నేహితుడు తెల్లారగట్లే అన్ని ఏర్పాట్లతో వస్తాడు. అంతవరకూ మనమ్ము ఈ ప్రాంతాల్లో కనిపించ కూడదు. రా!"

వసంతే మగాడై నేనే ఆడపిల్లనైతే ఎంత బావుండేది? నాదంతా ఆడపిల్ల మనస్తత్వం. కాస్త దుఃఖం వచ్చినా భరించలేను. సంతోషం కలిగినా తట్టుకోలేను.






నిజంగా నేనెంత అదృష్టవంతుణ్ణి.

వసంతలాంటి ధైర్యవంతురాలిని ... అందగత్తెని .... భార్యగా పొందగలుగుతున్నానంటే — ఇన్నేళ్ళ శాపఫలానికి భగవంతుడు ప్రసాదించిన వెత్తైకవరం, మహాభాగ్యం ఇదేనేమో!

అనాథగా పెరిగాను.

అదృష్టంకొద్దీ ఈ వూరొచ్చి పడ్డాను ఉద్యోగరీత్యా. నేనూ ... నా ఉద్యోగం.

వూరు పల్లెటూరైనా పుణ్యక్షేత్రం కావటంచేత ఎప్పుడూ పచ్చగా కలకలలాడుతూంటుంది.

సనాతన సాంప్రదాయంగల గ్రామం అది.

ఊరు వూరంతా పూజారులు...వ్యాపారస్థులు .... ఉద్యోగులే!

అనుకోని విధంగా దేవుడి తెప్పోత్సవంలో పరిచయమైంది వసంత. మా ఇంటిప్రక్క అమ్మాయి వసంత స్నేహితురాలు కావటం మా స్నేహం క్రమంగా, ప్రేమగా బలపడటానికి కారణమయింది.

నాకు చరిత్ర లేదు.

వసంత ఆ వూరి దేవాలయం ప్రధానార్చకులవారి ఏకైక కుమార్తె. సత్సాంప్రదాయం గల కుటుంబంలో పుట్టిన వసంత నా ప్రేయసి అయింది.

నా కవిత్వం ఆమెని ఆకట్టుకుంటే ఆమె మధురమైన గాత్రం నన్ను పరవశుడ్ని చేసింది.

సాహిత్యం - సంగీతం జంటయినట్టే మేమిద్దరం ప్రేమికులమయ్యాం.

* * *


"ఏమ్! రాజూ! ఏవిటి? ఆలోచిస్తున్నావ్! రా! .... అబ్బ! లే రాజూ!" నన్ను బలంగా చేత్తో లేపబోయి నా మీద పడింది వసంత.

నవ్వుతూ వసంతని కౌగిట బంధిస్తూ నిలబడ్డాను.

"పద!" అంటూ నా కౌగిలి విడిపించుకొని నా చేయి పట్టుకొని పరుగు పెట్టింది వసంత.

ఇద్దరం కాలి బాటవెంట పరుగెడుతున్నాం.

వెన్నెల రాత్రులు కావటంచేత దారి మసక .... మసకగానైనా కనబడుతోంది. దారి పొడుగునా పొదలు దెయ్యాల్లా









దట్టంగా ఉన్నాయి.

రెండుగంటలయింది భైరవవాక చేరుకునే సరికి.

విశాలమైన మైదానం. చుట్టూ రాతి చప్టాలు. ఎత్తుగా వేదికలా ఉన్న ప్రదేశంలో ఓ విగ్రహం ఉంది.

నేనావూరొచ్చి రెండేళ్ళు అయిందిగాని ఇంత సుందర ప్రదేశం ఈ మారుమూల ఈ కొండల నడుమ ... ఈ అడవిమధ్య ఉందని ఏనాడూ వినలేదు.

ఆశ్చర్యంగా వసంతకేసి చూసాను.

"ఇదే భైరవవాక. ఇదికూడా ఆ దేవాలయం వారి అధీనంలోనే ఉంది. అయితే — ఈ కాలభైరవ స్వామి దర్శనానికి భక్తులు రారు. శనివారం ఒక్కరోజే వస్తారు. అందుకే మనపెళ్ళి ఇక్కడ ఏర్పాటు చేశాడు మీ మిత్రుడు." నన్ను వాటేసుకుంటూ చెప్పింది వసంత.

"పద! ఆ మూల కూర్చుందాం!" వసంత నడుంచుట్టూ చేయివేసి నడిపించుకుంటూ వెళ్ళాను.

ఇద్దరం ఒకరికొకరం హత్తుకుంటూ కూర్చున్నాం.

"జీవితాంతం ఇలాగే నీ ఒడిలో ... నీ చల్లని నీడలో నా బ్రతుకు తెల్లవార్చాలని నా ఆశ రాజు!" నా ఒళ్ళో తల పెట్టుకుని కళ్ళు మూసుకుంటూ అంది వసంత.

"నాకో! నేను వ్రాసిన పాట నీ గొంతులో వినాలని పేరాశ. తీరుతుందంటావా?" ఆమె రేగిన కురులు సవరిస్తూ అన్నాను.

"కష్టం! ఎందుకంటే-నేను సంగీతం నేర్చుకున్నాక .... నీ పాటకు బాణీ కట్టి పాడాలి. అది ఇప్పుడిప్పుడే జరిగే పని కాదు." నవ్వుతూ అంది.

"ఎప్పటికైనా తీరుతుందికదా!"

వసంత మొహాన్ని నా చేతుల్లోకి తీసుకొని ఆమె పెదవులమీద ......

"ఛీ! పాడు! ఈ ఆరు ఘడియలూ ఆగలేవూ?" అని నన్నొక్కసారి తన రెండుచేతుల్తో వెనక్కి నెట్టి కాలభైరవ స్వామి విగ్రహం దగ్గరకు వెళ్ళి కూర్చుంది వసంత.

"సారీ! వసంత! తప్పయింది. క్షమించవూ!" చెంపలమీద రెండు వైపులా చేత్తో చరుచుకుంటూ అన్నాను.

"కాలభైరవ స్వామికి మొక్కుకో! ఏం కోరుకున్నా తప్పక తీరుస్తాడని ప్రతీతి." అంది నెమ్మదిగా చెవులో చెప్తున్నట్టు.

సరిగ్గా—

అదేసమయంలో—


వరుసగా మూడు గంటలు భీకరంగా అతి భయంకరంగా ఆ నిశ్శబ్ద నిశీధిలో ప్రతిధ్వనించాయి.


అప్పుడే—

చీకటి దట్టంగా పేరుకు పోయిన కొండమీద ఏదో వెలుగు కొండ చిలువలా పాకుతూ వెళుతోంది.

భయంగా వసంత ప్రక్కకు వెళ్ళి కూర్చున్నాను.

"మూడయింది రాజూ! ఈ గంటలు సమయ సూచకంగా కచేరిలో కొడతారు. అదిగో! ఆ కొండమీద చూడు. వెలుగు కదుల్తోందా? అది దేవస్థానం బస్సు. దేవాలయం తెరవటానికి .... ఆ దేవుడికి మేలుకొలుపు పాడటానికి అర్చకుల్ని






తీసుకు వెళ్తోంది."

ఈసరికి మా ఇంట్లో గలాటా ప్రారంభమై ఉంటుంది." నెమ్మదిగా అంది వసంత నాతల తనఒళ్ళోకి లాక్కుంటూ.

"గలాటా ?" ఆశ్చర్యంగా అన్నాను

"అవును. నేను ప్రక్కమీద లేకపోయేసరికి మా నాన్న కంగారు పడ్డూ? నా కోసం మా బంధువులందరి ఇళ్ళూ వెదుకుతారు. ఎక్కడా కనిపించక పోయేసరికి ఇక వూరిమీదపడి ముందుగా నీ గదికి వెళ్తారు" అంది వసంత.

"అమ్మో ! మరెలా ?" భయం ... భయంగా అన్నాను. నా గొంతెందుకో ఎండిపోతోంది. నాకు తెలియకుండానే నా శరీరం చెమట కమ్ముతోంది.

ఆ వూర్లో వసంత నాన్నగారిదే పై చేయి. ఆయన మాటంటే మాటే! ఆయనే ఆ వూరికి మోతుబరి. ఆయనే ఆ వూరి రాజకీయాల నేత.

"మీ స్నేహితుడు రామకృష్ణ ఈసరికి బయల్దేరేసే ఉంటాడు. మనం ఇక్కడ పెళ్ళిచేసుకొని .... ఫొటోలు తీసుకున్నాక వైజాగ్ వెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో మనకి వివాహం జరిగినట్టు నమోదు చేయించు కుందాం. ఆ తర్వాత మనమే ధైర్యంగా మా నాన్న ముందుకెళ్ళి నిలబడదాం" ధైర్యంగా అంది వసంత.

వసంత ఇంకా ఏదో చెప్పబోతుండగా నా మొహంమీద టార్చిలైట్ వెలుగు పడింది. ఉలిక్కిపడి ఛటుక్కున లేచి కూర్చున్నాను.

"మీ స్నేహితుడయి ఉంటాడు రాజూ!" ధైర్యం చిక్కబట్టుకొని అంది వసంత.



కానీ—

ఆ వచ్చింది వసంత నాన్నగారి మనుషులు. వాళ్ళతోపాటు రామకృష్ణకూడా ఉన్నాడు.

పాపం! రామకృష్ణని బాగా చితకబాదినట్టున్నారు. తల రేగి ... చొక్కా చిరిగి ... పెదవులు చిట్లి రక్తం కారుతోంది.

నన్నొకతను జుట్టు పట్టుకొని క్రింద పడేసి బలంగా బాది తన్నాడు. అలా ఎందరు కొట్టారో....! ఎందుకు తన్నారో! వాళ్ళ చిత్రహింసలు భరించలేక స్పృహ తప్పి పడిపోయాను.

• • •

"హవ్వ! ... హవ్వ! అమాయకుడనుకున్నాం. గ్రంథసాంగుడే!"

"ఎరగని నక్కలా ఉండి వూరికే ఎసరెట్టబోయాడు"

"ఏవీ ఎరగనట్టుండి పంతులుగారమ్మాయినే లేపుకుపోయాడా? అమ్మో! వీడిక ఈ యింట్లో ఉంటే నా కూతురు పరువేంగాను దేవుడో!"

గదంతా ఆ మాటలు ప్రతిధ్వనించేసరికి ఉలిక్కి పడి లేచాను.


ఆనాడు—

వూరంతా ఎలా ఎగతాళి చేసింది? ఎందరు ... ఎన్ని రకాలుగా దుర్భాషలాడారు?

ఆ రోజు—

నానుండి దూరమయిన వసంత మళ్ళా ఈ రోజు ప్రత్యక్షమయింది.

వసంతకి అన్నవరంలో పెళ్ళయిందని తెలుసు. కానీ, ఎక్కడికి వెళ్ళిపోయిందో ... ఏ వ్యక్తిని పెళ్ళాడిందో...




ఎలా ఉందో ... ఏమైపోయిందో ... ఇన్నేళ్ళయినా వసంత గురించి వీసమెత్తు కూడా తెలుసుకోలేక పోయాను.

వసంతకి పెళ్ళయిన సంవత్సరమే వాళ్ళ నాన్న హఠాత్తుగా చనిపోయాడు. వసంత అన్నలు ఉద్యోగరీత్యా వూర్లో ఆస్తంతా అమ్మేసి వూరొదిలిపెట్టి పోయారు.

నాలో వసంత జ్ఞాపకాలు మసకబారిపోతున్నాయి.

ఆ వూర్లో వాళ్ళ చరిత్రా సమాధయిపోయింది.

మళ్ళా—

ఇప్పుడు వసంత ప్రత్యక్షమయింది.

ఎలాగైనా వసంతని కలవాలి. ఎలా?

వసంత ఎక్కడికి వెళ్ళుంటుందో నాకు తెలుసు. ఇంతకుముందు తను అద్దెకున్న వాళ్ళింటికి వెళ్తుంది. నాకోసం కాకపోవచ్చు. వాళ్ళ స్నేహితురాలుకోసం వెళ్తుంది.

ఆ ఇంటికి వెళ్తే కొంతైనా సమాచారం లభించవచ్చు.

గభాలున లేచి బట్టలు వేసుకున్నాను. గదిలోనుండి బైటకొచ్చాను.

చీకటి పడింది. సాయంత్రం ఆరు దాటి ఏడుకేసి పరుగెడుతోంది కాలం.

వసంత ఇంకా ఉంటుందా? బహుశా వెళ్ళిపోయుంటుంది. చూద్దాం. వాళ్ళింటికి వెళ్తే విషయం తెలియకపోదు.

ఆ ఇంటికి వెళ్ళేసరికి ఆ అమ్మాయి ఎదురైంది. పాపం! ఎంత చిన్నమ్మాయి ఎలా అయిపోయింది. తను ఈ ఇంట్లో ఉండేటప్పుడు వసంతకన్నా చిన్నపిల్లలా ఉండే ఈ అమ్మాయి ఎలా పాడైపోయింది.

"రా! అన్నయ్యా! ఏవిటి ఇలా వచ్చారు?" పలకరింపుగా అంది ఆ అమ్మాయి.

"ఊరికినే!" అన్నాను అదోలా.

"నాకు తెలుసులే అన్నయ్యా! వసంత కోసమేగా వచ్చింది. తనూ నిన్ను అడిగింది. ఎలా ఉన్నారని....ఏం చేస్తున్నారని ... ఎంతమంది పిల్లలని ... ఎన్ని ప్రశ్నలో?! అన్నిటికీ ఒకే జవాబు చెప్పాను. అప్పటికీ, ఇప్పటికీ ఒకేలా ఉన్నాడని." చెప్తూ చెప్తూ దుఃఖం ఆపుకోలేక కళ్ళనీళ్ళు దించుకుంది ఆ అమ్మాయి.

నాకోసం జాలిపడే ఈ పసిపిల్ల

పిచ్చిదా ? మంచిదా ? నన్ను ఈ లోకమే అసహ్యించుకుంది.

ఈ పిచ్చిపిల్ల నా కోసం కంటతడి పెడుతోంది ?!

"ఇంతకీ వసంత ఈ వూరెందుకొచ్చినట్టో" సంశయంగా అన్నాను.

"వాళ్ళాయనకి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయిందట, వైజాగ్‌లోనే ఉంటున్నారట రేడియో స్టేషన్‌కి ఆడిషన్ టెస్ట్‌కోసం వచ్చి ఇలా వచ్చిందట వూరు చూద్దామని"

"ఆడిషన్ టెస్ట్‌కా ?"

"అవునన్నయ్యా !"

"ఆడిషన్ జరుగుతోంది ! స్టేషనంతా వారం రోజుల్నుండీ రద్దీగా ఉంటోంది. ఇద్దరికోసం ఆడిషన్ టెస్ట్ ఏర్పాటు చేస్తే మూడొందలమంది వచ్చారు. రోజుకు పదిహేను మందిని పిలిచి పాడిస్తున్నాం" నా మిత్రుడు వారం క్రితం అన్న మాట నా చెవుల్లో మార్మోగింది.

వసంత పూర్తిపేరు నోట్ చేసుకొని "వస్తానమ్మా !" అని చెప్పి వీధిలోకి వచ్చాను.

వసంత కోర్కె తీరబోతోందన్న మాట.

"తనని కోరుకున్న వసంతకి తను దక్కలేదు. కనీసం, ఆమె తన మనశ్శాంతికోసం ప్రాకులాడుతున్న సంగీతమన్నా ఆమెకు ఓ వరమై ఈ ఆడిషన్ టెస్ట్‌లో నెగ్గితే ఎంత బావుణ్ణు ?"

వసంత నెగ్గక పోయినా నెగ్గించాలి.

నా మిత్రులద్వారా ప్రయత్నించి వసంతకి ఈ అవకాశం అందజేయాలి.

స్థిరంగా ఒక నిర్ణయానికి వచ్చి అప్పటికప్పుడు వైజాగ్ బయల్దేరి వెళ్లాను.

రేడియో స్టేషన్లో పనిచేస్తున్న మిత్రుణ్ణి కలిశాను. వసంత గురించి చెప్తే ఆ మిత్రుడన్నాడు.

"ఈ ఆడిషన్ టెస్ట్‌కి ఇద్దర్ని కమిటీ మెంబర్లుగా వేసారు. అందులో స్టేషన్ డైరెక్టర్ ఒకరు. రెండో ఆయన్ని కలిసి చెప్పగలిగితే నేను స్టేషన్ డైరెక్టర్ గారికి చెప్తాను." అని ఇంటర్వ్యూ చేసినతని అడ్రసు చెప్పాడు.

మిత్రుడు చెప్పిన అడ్రసు ప్రకారం వెళ్ళాను.

ఆ ఇంటి నెంబరు వెదుక్కుంటూ చాలాసేపు తిరిగాను. ఎట్టకేలకు అడ్రసు దొరికింది.

ఇల్లు చాలా బావుంది. పొందికగా చెక్కిన ఆర్చిలా అద్భుతంగా ఉంది. గేటు తీసుకొని లోపలకు అడుగు పెట్టాను.

దారి పొడుగునా రకరకాల పూల మొక్కలు.

వరండాలో ఇద్దరమ్మాయిలు 'సితార' పట్టుకొని కూర్చున్నారు. ఎక్కడనుండో మృదంగ ధ్వని లీలగా వినిపిస్తోంది.

గదిలోనుండి బాల మురళీకృష్ణ ఆలపిస్తున్న మోహన గీతం మనోహరంగా వినిపిస్తోంది.


ఆ కమనీయ వాతావరణానికి నేను తన్మయుణ్ణయ్యాను.

బహుశా ఆ కమిటీ మెంబరు ఇంటిని సంగీత నిలయంగా తీర్చి దిద్దారు అనుకున్నాను.

"ఎవరు కావాలండీ ?" సితార పట్టుకూర్చున్న పాప లేచి నా దగ్గరొచ్చి అడిగింది,

"నాన్నగారున్నారమ్మా !" అన్నాను.



జీవిత భీమా పాలసీ తీసుకొనేటపుడు సరియైన వివరాలు తెల్పడం ఎంతయినా అవసరం

మీ క్లైముల శీఘ్ర పరిష్కారానికి అది మాకెంతో సహాయకరం


మీరు జీవిత భీమా పాలసీ తీసుకొనేటపుడు మీ ఎల్ ఐ సి ఏజెంట్ మీకు అన్ని విధాలా సహాయం చేయడానికి, సరియైన సలహాలివ్వడానికి సంసిద్ధంగా వుంటాడు. అలాగే మీ నుండి కూడా అతడికి కావాలి మీ పూర్తి సహకారం.

**అత్యధిక విశ్వసనీయత :**
జీవిత భీమా 'అత్యధిక విశ్వసనీయత' పై ఆధారపడిన ఒప్పందం (అన్ని తథ్యాలు తెలియ చేయడానికి బద్ధత) కనుక, మీరు పాలసీ పత్రాలు పూర్తి చేసేటపుడు, మీ అసలు వయస్సు,

మీ కుటుంబ సంబంధమైన, వైద్యకీయమైన అన్ని వివరాలను మరియు అవసరమైన ఇతర సమాచారాన్ని అందజేయడం ఆవశ్యకరం. మీరు ఇలా తెలియజేసిన తథ్యాల ఆధారంగా మీ ప్రపోసల్ విలువ కట్టబడి, స్వీకరించబడుతుంది.

**లాభదాయకం :**
గతంలో లేక ప్రస్తుతం ఏమైనా జబ్బు చేసి వుంటే దాన్ని గురించి తెల్పడం వలన జీవిత భీమా రక్షణ లభించదని చాలా మంది అపోహపడుతారు. ఇది ఎంత మాత్రం నిజం కాదు. తమ జబ్బులను గురించిన నిజమైన మరియు పూర్తి వివరాలు తెలిపి, మామూలు రేట్లతో లేక కొంత అదనం చార్జీలతో జీవిత భీమా రక్షణ పొందిన పాలసీ హోల్డర్లు వేలకొలది కలరు.


**గుర్తుంచుకోండి :**
మీ క్లైముల పైకాన్ని త్వరగా పొందాలంటే దానికి సులభ మార్గం—పాలసీ తీసుకొనేటపుడు పూర్తి వివరాలు అందించడమే !




లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

30 సంవత్సరాల సుదీర్ఘ ప్రజా సేవ.

LIC/CO/1-87




"లోపల ప్రక్క గదిలో ఉన్నారు వెళ్ళండి." ఆ పాప మళ్ళా తన సితార దగ్గరకు పరుగందుకుంది.

ఇంట్లో అడుగు పెట్టీ పెట్టగానే నా చెవుల్లో సప్తస్వరాలు వినిపించాయి.

అడుగులో అడుగు వేసుకుంటూ ఆ గది ద్వారం దగ్గరకు చేరాను. తలుపులు దగ్గరగా వేసున్నాయి.

తలుపుల సందులోనుంచి చూస్తే లోపల వ్యక్తులు కన్పిస్తున్నారు. పిలవాలో పిలవ కూడదో?

క్షణం తటపటాయించాను.

లోపలనుంచి చిన్నగా మాటలు వినిపిస్తున్నాయి.

"వసంతా! పాలు తీసుకు రాగలవా?"

"అలాగే! తెస్తానండి. కొంచెం నేనొచ్చేలోగా ఈ వీణను శ్రుతిచేయరా?"

ఉలిక్కి పడ్డాను.

"ఆ గొంతు..."

తలుపు సందులోనుంచి పరిశీలనగా చూసాను.

వసంత!

ఆ గదిలోనుంచి అలా వంట గదిలోకి గాలిలా వెళ్తోంది.

"వసంత భర్తేనా! నను కలవాలని వచ్చిన వ్యక్తి."

"లోపలకురండి!" గంభీరంగా లోపలనుంచి ఆ వ్యక్తి నన్ను పిలిచాడు.

తత్తరపాటు అణుచుకుంటూ లోపలకు వెళ్ళాను తలుపులు నెట్టుకుంటూ.

"కూర్చోండి!" అతనన్నాడు.

నిశ్శబ్దంగా కూర్చున్నాను.

"తీసుకోండి పాలు!" వసంత పాల గ్లాసుతో వచ్చింది.

"వాడికివ్వు వసంతా!" అతనన్నాడు.

ఆశ్చర్యంగా కళ్ళింత చేసుకొని నన్ను చూసింది వసంత.

పాల గ్లాసు అందుకున్నాను.


"మీ...రు...!" అతను సందిగ్ధంగా అన్నాడు.


నన్ను నేను పరిచయం చేసుకోబోయాను.

"రాజు! అని చెప్పేదాన్ని కదండి ఇతనే" వసంత తన భర్తకు నన్ను పరిచయం చేసింది.


"హలో! మీరేనా? మీ గురించి వసంత నాకంతా చెప్పింది. మీ అమాయకత్వానికి జాలిపడాలో...బాధపడాలో అర్థంకావేదు












మాట. గతించిన జ్ఞాపకాలతో .... పీడ కలల్తో మీ బ్రతుకును మీరే నాశనం చేసుకుంటున్నారు. పెళ్ళి చేసుకోండి. మీ సాహిత్య సృష్టి మళ్ళా ప్రారంభించండి."

నాకు నోట మాట రావటంలేదు.

అతనికేసి ఆశ్చర్యంగా చూసాను.

అతను మామూలు మనిషేనా? ఇతను అందరిలాంటి వాడేనా? కాదు. ఏమగాడూ సహించని విషయాన్ని ఇతను అతి మామూలుగా .... అతి నిరాడంబరంగా ఎలా చెప్పగలుగుతున్నాడు?

"మీరు వెంటనే పెళ్ళి చేసుకోండి. పెళ్ళి చేసుకుంటే మీ బ్రతుక్కి .... జీవితానికి ఓ సార్థకత ఏర్పడుతుంది. మీ వాళ్ళిద్దర్ని సుఖంగా సాకడమే మీ కర్తవ్యం .... మీ బ్రతుక్కి పరమార్థం...." అతనే మళ్ళా అన్నాడు.

"సారీ! .... అమ్మా, వెళ్ళొస్తా! ఇలా రండి." వసంత పిల్లల్ని పిలిచింది. వరండాలో సితార సాధనలో ఉన్న అమ్మాయిలిద్దరూ వచ్చారు.

"అన్న లేడా?" వసంత ఆ పిల్లల్తో అంది.

"అదిగో! పెరట్లో మృదంగనాదం వినిపిస్తోందిగా!" స్వాతి తన ఆల్చిప్పల్లాంటి కళ్ళు త్రిప్పుతూ అంది.

నా మనసు అర్థమైంది.

నా కళ్ళకున్న పొరలు విచ్చుకున్నాయి.

నా కళ్ళల్లో నాకు తెలియకుండానే కన్నీటిధార కదిలింది.

"వస్తానండి"

ఆ దంపతులిద్దరికీ నమస్కారం చేసి పిల్లలిద్దర్నీ ముద్దు పెట్టుకుని బైటపడ్డాను.

రోడ్డుమీదకు వచ్చి వెనక్కి తిరిగి చూసాను.

వసంత .... పిల్లలు... వాళ్ళ ఆయన వరండాలో నిలబడి నాకేసే చూస్తున్నారు.

ఆక్షణం—

ప్రపంచంలో ఏదో మార్పు కనిపించింది.

మనుష్యులంతా సాధువుల్లా ... భగవంతుల్లా కన్పిస్తున్నారు.